ఈనాడు జగిత్యాల
సోమవారం అక్టోబరు 14, 2024

వైభవంగా దసరా ఉత్సవాలు

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలో శనివారం దసరా పర్వదినం పురస్కరించుకొని శమీపూజ, మహిషాసుర సంహారం తదితర వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి ప్రధానార్చకులు నంబి వేణుగోపాలాచార్య ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల మధ్య బయలుదేరిన స్వామివారి పల్లకీసేవ జంబిగద్దె వద్ద ఏర్పాటు చేసిన జమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షిణం చేయగా తిగుళ్ల విశ్వశర్మ పర్యవేక్షణలో వేదమంత్రాల మధ్య అదనపు కలెక్టర్ పి.రాంబాబు శమీపూజ నిర్వహించారు. పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, లక్ష్మణ్, తహసీల్దార్ రాంమోహన్, వార్డుసభ్యుడు నారాయణరెడ్డి, ఆర్ఐ నరేందర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జంబిగద్దె ఆవరణలో నవదుర్గా, కనకదుర్గా సేవాసమితులతో పాటు, పలుచోట్ల మహిషాసుర సంహార కార్యక్రమం నిర్వహించారు. పట్టణ, రూరల్ సీఐలు ఎస్.వేణుగోపాల్, క్రిష్టారెడ్డిలు, పలువురు ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు.


జగిత్యాలలో మహిషాసుర సంహారాన్ని వీక్షిస్తున్న ప్రజలు

జగిత్యాల: అందరికీ విజయం కలగాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. విజయదశమి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ, వాహన పూజ నిర్వహించారు. దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. శమీ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అదనపు ఎస్పీ భీంరావు, డీఎస్పీ రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, రామక్రిష్ణ, వేణు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్‌అలీఖాన్, రూరల్ సీఐ పాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. యోగ, ఉగ్ర, శ్రీవేంకటేశ్వరస్వాముల ఉత్సవ సేవలను దేవస్థానం నుంచి వీధుల్లో శోభాయాత్రగా జంబి గద్దెకు తీసుకువెళ్లారు. విప్ లక్ష్మణ్ కుమార్, డీఎస్పీ రఘుచందర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


జంబిగద్దె వద్ద శమీపూజలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు తదితరులు


ధర్మపురిలో శమీ పూజలో విప్ లక్ష్మణ్‌కుమార్


ఆయుధ పూజలో ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు ఎస్పీ తదితరులు

ఘనంగా నర్సింహస్వామి జాతర

మేడిపల్లి, న్యూస్‌టుడే: మేడిపల్లిలో ఆదివారం యోగానంద నర్సింహస్వామి జాతర వైభవంగా జరిగింది. ఏటా దసరా మరుసటి రోజున జాతర జరుగుతుంది. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడిపల్లి సహా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు హాజరయ్యారు.

మత్తులో డ్రైవింగ్

శిక్షలు, జరిమానా విధించినా మారని తీరు


- పక్షం రోజుల కిందట జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో నడుచుకుంటూ వెళుతున్న వారిని తాకుతూ అతివేగంతో వంపులు తిరుగుతూ ద్విచక్ర వాహనం దూసుకెళ్లింది. కొద్దిలో పెను ప్రమాదం తప్పింది.
- జగిత్యాల పట్టణంలో వారం కిందట దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఆకస్మాత్తుగా వెనుక నుంచి 80 కి.మీ పైగా వేగంతో ఓ ద్విచక్రవాహనం దూసుకెళ్లింది. ఆ వాహనంపై ఇద్దరు యువకులు ఉన్నారు. తృటిలో ప్రమాదం తప్పింది. అదృష్టం బాగుండి ఎవరికీ ఏం కాలేదు.

ఈ ఘటనలే కాదు జిల్లా వ్యాప్తంగా ర్యాష్ డ్రైవింగ్ భయభ్రాంతులకు గురిచేస్తోంది. జిల్లాలో ఈ ఒక్క ఏడాదిలోనే 203 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీటితోపాటు డ్రంక్ అండ్ డ్రైవింగ్ 5,508 కేసులు నమోదయ్యాయి. చాలా మందికి కోర్టు శిక్షలు, జరిమానా విధించినా మార్పు రావటం లేదు. పోలీసులు కఠిన చర్యలు చేపట్టకపోతే కేసులు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌టుడే, జగిత్యాల, జగిత్యాల గ్రామీణం

రాత్రి వేళల్లో ఎక్కువ..

జిల్లాలో నిత్యం రూ.2 నుంచి రూ.3 కోట్ల మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. పల్లెల్లోనూ గొలుసు మద్యం దుకాణాలు విచ్చలవిడిగా వెలిశాయి. మరో వైపు గంజాయి మత్తులో యువకులు, విద్యార్థులు మునిగిపోతున్నారు. ఆ మత్తులో ఇష్టారీతిగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఏడాది 2024 రోడ్డు ప్రమాదాలు జరగగా వందలాది మంది క్షతగాత్రులుగా మారారు. చాలా మంది మృతి చెందారు. రాత్రి వేళల్లో యువకులు అతి వేగంతో వాహనాలు నడపటం సర్వసాధారణమైపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నా వాహన నంబరు ఉండదని బాధితులు వాపోతున్నారు. జగిత్యాల పట్టణంతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి రహదారులపై ర్యాష్ డ్రైవింగ్ కనిపిస్తోంది.



కానరాని తనిఖీలు..

జిల్లాలో అతి వేగంతో వెళ్లే వారిని నియంత్రించేందుకు స్పీడ్ గన్‌తో జరిమానాలు విధించేవారు. స్పీడ్‌గన్‌ను జగిత్యాల-కరీంనగర్ రహదారి, నిజామాబాద్ రహదారిపై ఉపయోగిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. మరో వైపు హైవేలపై ప్రత్యేక బృందాలను గస్తీ తిప్పుతూ అతివేగంతో వెళ్లే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తే భయం పెరిగే అవకాశం ఉంది. ఎక్కడా లేని విధంగా ట్రాఫిక్ శిక్షణ కేంద్రం జిల్లా కేంద్రంలో ఉంది. గతంలో ప్రమాదాలకు పాల్పడిన వారికి శిక్షణ ఇచ్చి పంపేవారు. ఇప్పుడు ఎలాంటి శిక్షణ ఇవ్వటంలేదు. మద్యం తాగే వారిని గుర్తిస్తున్నా జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోనూ తనిఖీలు చేసి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రాత్రి వేళల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేసి రోడ్లపై జులాయిగా తిరిగే వారిని గుర్తించి స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించి పంపేవారు. ప్రస్తుతం తనిఖీలు చేయటంలేదు.


రోడ్డు ప్రమాద దృశ్యం (పాత చిత్రం)

కఠిన చర్యలు తీసుకుంటున్నాం

అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ర్యాష్‌డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే 5 వేలకుపై కేసులు నమోదయ్యాయి. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తాం. అన్ని స్టేషన్ల పరిధిలోనూ ఆదేశాలు జారీ చేస్తాం.

- అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

విస్తరణకు మోక్షమెప్పుడో?

ఇరుకు రోడ్లతో పట్టణ ప్రజల అవస్థలు

న్యూస్‌టుడే, కోరుట్ల

కోరుట్ల పట్టణంలో ప్రధాన రహదారుల విస్తరణకు మోక్షం లభించడం లేదు. ప్రధాన రహదారి విస్తరణ చేపట్టి రోడ్డు మధ్యలో అధునాతన డివైడర్లు నిర్మించారు. వాటి మధ్యలో హైమాస్టు లైట్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఇతర ముఖ్యమైన రహదారులు ఎప్పుడు విస్తరణకు నోచుకుంటాయో తెలియక ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. పట్టణంలో అత్యంత రద్దీగల అయిలాపూర్‌రోడ్డు, గాంధీ రోడ్డు, కల్లూర్‌రోడ్డు విస్తరణకు మున్సిపల్ పాలకవర్గం తీర్మానం చేసి సుమారు 28 ఏళ్లు గడుస్తున్నా పనులు చేపట్టడం లేదు. జులై 2022లో వరంగల్ నుంచి ప్రత్యేక బృందం వచ్చి సర్వే చేపట్టినా కాగితాలకే పరిమితమయ్యాయి.

కట్టడాలు తొలగించరు..

అత్యంత రద్దీగల అయిలాపూర్‌రోడ్డు విస్తరణకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు రెండేళ్ల కిందట సర్వే చేపట్టి మార్కింగ్ చేశారు. ప్రధాన రహదారి నుంచి కేరళ హైస్కూల్ వరకు 60 ఫీట్ల వెడెల్పుతో రోడ్డును విస్తరించి ఇరువైపులా మురుగు కాలువ నిర్మించాలని నిర్ణయించారు. మురుగు కాలువ నిర్మాణం కోసం రూ.30 లక్షల పట్టణ ప్రగతి నిధులను కేటాయించారు. రోడ్డు వెడెల్పులో ఇళ్లు, భవనాలు కోల్పోతున్న యజమానులతో మున్సిపల్ అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. భవనాల తొలగింపునకు సమయం కావాలని యజమానులు కోరడంతో గడువు ఇచ్చారు. కానీ రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు భవనాల తొలగింపు ప్రక్రియ చేపట్టలేదు. చివరికి రోడ్డు మధ్యలోంచి 25 అడుగులు వెడెల్పు చేసేందుకు భవన యజమానులతో సమావేశమై ఒప్పించారు. ఇప్పటివరకు భవనాలు, కట్టడాలను తొలగించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. అయిలాపూర్‌రోడ్డులో తారు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. ఇరుకు రోడ్డుపై నిత్యం వాహనాల రాకపోకలు సాగించేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. భవనాలను తొలగించి రోడ్డును విస్తరించి తారు నిర్మాణం చేపడితే పట్టణంతో పాటు, వివిధ గ్రామాల నుంచి వచ్చే వాహనాల రాకపోకల ఇబ్బందులు తొలగుతాయి.


కోరుట్ల-అయిలాపూర్ రోడ్డుపై రద్దీ


గాంధీరోడ్డులో విస్తరణ చేపట్టకముందే వేసిన తారు

27 ఏళ్లు గడుస్తున్నా..

పట్టణంలోని చాలా కాలనీలకు అనుసంధానంగా ఉన్న గాంధీరోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గాంధీరోడ్డును 60 ఫీట్ల వెడల్పు చేసేందుకు నిర్ణయించి 27 ఏళ్లకుపైగా గడుస్తున్నా ఇప్పటివరకు విస్తరణ పనులు చేపట్టడం లేదు. గాంధీరోడ్డు చాలా ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా భారీ వాహనాల వెళ్లేందుకు వీలు లేకపోవడం, రాకపోకలకు ఏళ్లతరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2019లో టీయూఎఫ్ఐడీసీ కింద కార్గిల్‌చౌక్ నుంచి వేంకటేశ్వర దేవాలయం వరకు, ఐబీరోడ్ నుంచి గడి బురుజు వరకు మాడ్రన్ స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.1.5 కోట్లు కేటాయించారు. గాంధీరోడ్డు విస్తరిస్తేనే లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. రోడ్డు విస్తరణలో చాలావరకు ఇళ్లు, భవనాలను తొలగించాల్సి ఉంటుంది. కట్టడాలను తొలగించకుండా రోడ్డు విస్తరణ చేపట్టక ముందే ఏడాది కిందట కార్గిల్‌చౌక్ నుంచి జగ్గీజవన్‌రామ్ విగ్రహం వరకు తారు రోడ్డు నిర్మించారు. ఇరుకు రోడ్డుపై ఎదురెదురుగా వాహనాలు వెళ్లలేక ఇక్కట్ల నడుమ రాకపోకలు సాగిస్తున్నారు.

బ్యాలెట్ పెట్టెలు సిద్ధమేనా!

పల్లె పోరు నేపథ్యంలో మరమ్మతు చేయిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

పంచాయతీ ఎన్నికల్లో కీలకమైనా బ్యాలెట్ పెట్టెలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలల్లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికార యంత్రాంగం జిల్లా కేంద్రాల్లోని గోదాంలలో భద్రపరిచిన బ్యాలెట్ పెట్టెలను సరి చూస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి ఆరేళ్లు సమీపిస్తుండటంతో వీటిలో ఏమైనా లోపాలు ఉన్నాయా? చెడిపోయయా? అనేది తేల్చే పనిలో ఉన్నారు. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేస్తున్నారు.

పెరగనున్న వార్డులు

2018-19 పంచాయితీ ఎన్నికలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 1,214 గ్రామ పంచాయతీల్లో 11,132 వార్డులున్నాయి. ప్రతి వార్డులో 250 ఓటర్లు ఉంటారు. ఎన్నికల్లో వార్డుకొక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఇటీవల ప్రకటించిన తుది జాబితాలో ఓటర్ల సంఖ్య పెరగడంతో ఉమ్మడి జిల్లాలో వార్డుల సంఖ్య పెరగనుంది. జిల్లాల వారీగా పెరిగిన ఓటర్ల ఆధారంగా వార్డుల లెక్కలను కొలిక్కి తేనున్నారు. దీంతో అధికారులు ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెలు ఎన్ని? చెడిపోయిన ఎన్ని? అని తనిఖీ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు తీసుకెళ్లిన బ్యాలెట్ పెట్టెలపై ఆరా తీస్తున్నారు. వీటిని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వానికి నివేదించనున్నారు. బ్యాలెట్ పెట్టెలు పక్కదారి పక్కకుండా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోంది. ఎన్నికల ప్రకటన లోపు అన్ని ఏర్పాటు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.


పెద్దపల్లి వ్యవసాయ గోదాంలో బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేస్తున్న అధికారులు



రిజర్వేషన్లపై వీడని ఉత్కంఠ

గత భారాస ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదేళ్ల పాటు పంచాయతీ రిజర్వేషన్లు ఉంటాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం అదే చట్టాన్ని కొనసాగిస్తుందా? కొత్త రిజర్వేషన్లు తీసుకొస్తుందా? అన్న దానిపై ఉత్కంఠ వీడటం లేదు. ఓ వైపు బీసీ కులగణన చేయాలని సంబంధ సంఘాల నేతలు పట్టుబట్టడంతో ప్రభుత్వం సర్వే చేయాలని ఆదేశించింది. మరోవైపు ఎస్సీ వర్గీకరణ చేసే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆయా వర్గాల వారు డిమాండ్ చేస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రస్తుత పంచాయతీల వివరాలు

● జిల్లా	★ పంచాయతీలు	■ వార్డులు
జగిత్యాల	380	3,500
పెద్దపల్లి	267	2,436
కరీంనగర్	313	2,966
రాజన్నసిరిసిల్ల	254	2,230

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన పెంట తిరుపతి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికైన సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘాలు, కొడిమ్యాల క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. హుస్నాబాద్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న తిరుపతి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరించి బిహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆదివారం పోటీలకు బయలుదేరుతున్న సందర్భంగా తిరుపతిని సన్మానించి ఆర్థికసాయం అందజేశారు. దీపక్, చిరంజీవి, దిలీప్, నరేష్, మహేష్, పీటర్, ప్రవీణ్, దేవేందర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు రాజయ్య, రాజబాబు, రాపర్తి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు సామ సురేందర్ రెడ్డి, కార్యదర్శి డేవిడ్‌సన్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుడు పెంట తిరుపతిని సన్మానిస్తున్న యువజన సంఘాల నాయకులు

కొండగట్టులో వేడుకలు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయంలో శ్రీసీతా రామ లక్ష్మణ విగ్రహాలను శనివారం అశ్వవాహనంపై ముత్యంపేట పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు స్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ స్థానాచార్యులు కపిందర్, సిబ్బంది పాల్గొన్నారు. కొండగట్టు ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా ఎస్సీ ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జి ఎ.నీరజ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. ఆలయ ఇన్‌స్పెక్టరు అశోక్ న్యాయమూర్తి దంపతులను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదం అందించగా, అర్చకులు ఆశీర్వదించారు.

వాహనపూజల ఆదాయం రూ.3.37 లక్షలు

దసరా రోజు కొండగట్టులో వాహన పూజలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. వాహన పూజల ద్వారా ఆలయానికి రూ.3.37 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో రామకృష్ణారావు తెలిపారు.


పూజల కోసం బారులు తీరిన వాహనాలు

శమీపూజ ప్రత్యేకం

పది తరాల ప్రస్థానం

జగిత్యాల విద్యానగర్, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె వద్ద శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శమీపూజ నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. గతంలో దసరా పర్వదినాన జగిత్యాల మండలం అంబారిపేట గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి పేరిట కాషాయ రంగులో ఏర్పాటు చేసిన భగవత్ ధ్వజం ఎగురవేసే వారు. తరువాత జగిత్యాల పట్టణంలోని గడియారం వద్ద 'పంచెక్కి' జెండాను ఆవిష్కరించే వారు. తుపాకుల వంశస్థులైన దర్జీలు, శ్రీకృష్ణుడు, పంచ పాడవులకు చిహ్నంగా తెలుపు రంగు వస్త్రంపై అరచేతి అయిదు వేళ్లు, అందులో నెమలి పించం ఆకారంతో పంచెక్కి పేరిట ప్రత్యేకంగా తయారు చేసిన జెండాను శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం ఏర్పాటు చేసిన మంగళ వాయిద్యాల మధ్య ఆవిష్కరించేవారు. మంగళ వాయిద్యాలు తిరిగి దేవస్థానానికి చేరుకోగానే దాసరి వంశస్థులు మొదటగా మంగళహారతి ఇచ్చిన తరువాత స్వామి వారికి పూజలు మొదలయ్యేవి. అనంతరం ఆలయం నుంచి బయలుదేరిన పల్లకీసేవ జంబిగద్దె వద్దకు చేరుకున్న తరువాత, ప్రత్యక్షంగా గరుడ పక్షి దర్శనం ఇచ్చిన తరువాతే శమీపూజ ప్రారంభం చేసేవారు. అనంతరం జంబిగద్దె ఏర్పాటు చేసినా జమ్మిచెట్టు చుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణం చేయడంతో శమీపూజ పూర్తయ్యేది. ఆ తరువాత సమీపంలోని మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని, పాలపిట్టను చూడటం ఆనవాయితీగా కొనసాగింది.


శ్రీవేణుగోపాలస్వామి ఆలయం

ఆరు శతాబ్దాలుగా..

నర్సయ్య, సీతారామయ్య, అప్పలాచార్య, నర్సింగం, గోపాలం, నర్సయ్య, రామానుజం, మాధవాచార్యుల దశాబ్దాలుగా శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం ప్రధానాచార్యకులు నంబి వేణుగోపాలాచార్య కౌశిక ఆధ్వర్యంలో దసరా పురస్కరించుకొని ఏటా జంబిగద్దె వద్ద శమీపూజ నిర్వహిస్తున్నారు. శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి స్వామి వారి పల్లకీసేవ జంబిగద్దె వద్దకు శోభాయాత్రగా వెళ్లి వేద మంత్రాల మధ్య శమీపూజ నిర్వహించడం ఆనవాయితీ కొనసాగుతోంది. నంబి వంశస్థులైన ఆలయ ప్రధానార్చకులు నంబి వేణుగోపాలాచార్య వివరించిన సమాచారం మేరకు ఆరు శతాబ్దాలుగా శమీపూజ కొనసాగుతోంది.

నాడు పటేల్, పట్వారీలు.. నేడు కలెక్టర్

జగిత్యాల గ్రామ పంచాయతీగా కొనసాగిన సమయంలో నిర్వహించిన శమీపూజ కార్యక్రమంలో గ్రామాధికారులగా ఉన్న పటేల్, పట్వారీలు పూజ నిర్వహించేవారు. ఇందులో ఇనుములపల్లి వంశస్థులు శమీపూజ నిర్వహించగా, చాకుంట వంశస్థులు స్వామివారికి జంబి కింది రాత పేరిట కానుకలు చదివేవారు. అంతకుముందు రాచరిక పాలనలో ప్రత్యేకంగా రాచ పురోహితుడు శమీపూజ నిర్వహించేవారు. శమీపూజ నిర్వహణ కోసం హకుం పేరిట ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందేవారు. గ్రామపంచాయతీగా ఉన్న జగిత్యాల, తరువాత తాలుకాగా ప్రస్తుతం జిల్లా కేంద్రంగా ఏర్పాటవగా మొదట్లో పటేల్, పట్వారీలు, ప్రస్తుతం రెవెన్యూ అధికారులైన జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లు నిర్వహిస్తున్నారు.


జెండా గద్దెపై భగవత్ ధ్వజం

వారసత్వం కొనసాగిస్తున్నాం..

శమీపూజ కార్యక్రమాన్ని వారసత్వంగా కొనసాగించడం నా పూర్వజన్మ సుకృతం. మా తాతల కాలం నుంచి వస్తున్న ఆనవాయితీని నా పర్యవేక్షణలో కుమారుడు మధుసూదనాచార్య నిర్వహిస్తున్నారు. శమీపూజ నిర్వహణ భావితరాలకు వైభవంగా అందించేందుకు కృషి చేస్తాం. శమీపూజను ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రత్యక్షంగా తిలకించేందుకు వీలుగా, గతంలో ఉన్న తీరులో అభివృద్ధి చేయడం అవసరం.

- నంబి వేణుగోపాలాచార్య కౌశిక, ప్రధానార్చకులు



నీరుండీ నిర్లక్ష్యం.. ఏటా దుర్భిక్షం

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం, హుజూరాబాద్, పెద్దపల్లి


- ఎస్సారెస్పీ ఆయకట్టుకు తప్పని కరవు
- కాలువలకు మరమ్మతు లేక కర్షకులకు కష్టాలు

పరిశీలన

ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ కింద దాదాపు 5.56 లక్షల ఎకరాల ఆయకట్టుంది. కాలువలు నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకు ఏనాడూ పూర్తి స్థాయిలో నీరందలేదు. దాదాపు రెండు దశాబ్దాల కిందట వేసిన సిమెంట్ లైనింగ్ దెబ్బతినడం, తూములు, డ్రాపులు, యూటీలు పాడవడంతో తరచూ గండ్లు పడుతున్నాయి. నీటి వినియోగ సంఘాలు రద్దు కావడంతో నిర్వహణ అటకెక్కింది. కాలువలు భారీగా దెబ్బతిన్నా తాత్కాలిక మరమ్మతులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. యాసంగి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో ఎస్సారెస్పీ కాలువల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' పరిశీలన ఇది.

శ్రీరామ సాగర్ జలాశయం(ఎస్సారెస్పీ) ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవసాయానికి ప్రాణాధారం.. ఈ ఏడాది భారీ వర్షాలకు నిండు కుండలా మారింది.. యాసంగి సీజన్ ఆరంభం కానుండగా రైతులు కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారు.. వారి కలలను కాలువలు వెక్కిరిస్తున్నాయి.. పూడికతో పేరుకుపోయి, పిచ్చిమొక్కలతో కమ్ముకుపోయి, ప్రవాహాన్ని ముందుకెళ్లనీయని నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపుతున్నాయి.. అదనులో చేయాల్సిన పనులను గుర్తు చేస్తున్నాయి..

గరిష్ఠ నీటి నిల్వ : 80.501 టీఎంసీలు
ప్రస్తుతం 80.501 టీఎంసీలు




శ్రీరాంసాగర్ జలాశయం

1. మొత్తం ఆయకట్టు విస్తీర్ణం
2. ప్రస్తుతం సాగులో ఉన్న విస్తీర్ణం
3. మొత్తం డిస్ట్రిబ్యూటరీ కాలువల పొడవు
4. పంట కాలువల పొడవు
5. పూర్తి స్థాయిలో నీరందకపోవడానికి కారణాలు
6. సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలు
7. మరమ్మతుకు అవసరమైన నిధులు/ప్రతిపాదనలు
8. ఉపాధిహామీలో పూడికతీత పనులు



మానకొండూర్ మండలం పచ్చునూరు శివారులో గండి పడిన డీబీఎం-6(4ఎల్) ఉపకాలువ



కరీంనగర్

(1) 1.40 లక్షల ఎకరాలు (2) 1.12 లక్షల ఎకరాలు
(3) 20 డిస్ట్రిబ్యూటరీలు, 200 కిలోమీటర్లు
(4) 500 కిలోమీటర్లు
(5) కాలువల నిర్వహణ సరిగ్గా లేకపోవడం, డ్రాప్స్, లైనింగ్, తూముల షట్టర్లు కూలిపోవడం, కాలువల్లో పిచ్చిమొక్కలు, చెట్లు పెరగడం, సిల్ట్ పేరుకుపోవడం. (6) ప్రత్యేకంగా ఏమీ లేవు.
(7) రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వానాకాలం సీజన్ నీటి విడుదల నిలిపివేసిన అనంతరం పనులు చేసేలా ప్రణాళిక రూపొందించారు.
(8) మానకొండూర్, శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లోని సబ్ మైనర్ కాలువల్లో కొంతమేర పూడికతీత పనులు చేశారు. డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల్లో పనులు చేయాల్సి ఉంది.

ఇలా చేస్తే ప్రయోజనం

- మరో రెండు నెలల్లో యాసంగి వరి నాట్లు మొదలు కానుండటంతో ఈలోగా ఉపాధిహామీలో కాలువల్లో పూడికతీత, పిచ్చిమొక్కలు, చెట్ల తొలగింపు పనులు చేపట్టాలి.
- జగిత్యాల జిల్లాలో కాకతీయ కాలువతో పాటు వరదకాలువ నుంచి చెరువుల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తి చేయాలి.
- గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జల మట్టం పెరిగి పంపుసెట్ల ద్వారా నీటిని పారించే వీలుంటుంది.
- అన్ని కాలువలకు లైనింగ్ పనులు చేయాలి. దెబ్బతిన్న నిర్మాణాలకు సీజన్ విరామంలో మరమ్మతులు పూర్తి చేస్తే చివరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందుతుంది.



జగిత్యాల

(1) 1.63 లక్షల ఎకరాలు
(2) 1.27 లక్షల ఎకరాలు
(3) 136 కిలోమీటర్లు
(4) 401 కిలోమీటర్లు
(5) కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగడం, షట్టర్లు, కట్టలు శిథిలం కావడం తదితర కారణాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన కాకతీయ కాలువలో ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో తక్కువ నీటిని వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు, సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు దెబ్బతినడంతో గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించలేని పరిస్థితి.
(6) బీర్‌పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, బుగ్గారం, సారంగాపూర్, కోరుట్ల, మల్యాల, గొల్లపల్లి, ఎండపల్లి, పెగడపల్లి మండలాల్లోని చివరి ఆయకట్టు గ్రామాలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు.
(7) రూ.176.31 కోట్లు. ఇటీవల రూ.91 కోట్లతో మరమ్మతులు చేశారు. 62 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.
(8) గతేడాది నుంచి దాదాపు 65 కిలోమీటర్ల దూరం కాలువల్లో చెట్లు, మొక్కల తొలగింపు పనులు చేశారు. ఈ ఏడాది భారీ వర్షాలు కురవడంతో అన్ని ప్రాంతాల్లోనూ తక్షణ మరమ్మతులు చేయాల్సి ఉంది.



జగిత్యాల మండలంలో దెబ్బతిన్న కాకతీయ కాలువ లైనింగ్



పెద్దపల్లి

(1) 2.50 లక్షల ఎకరాలు
(2) 1.80 లక్షల ఎకరాలు.
(3) 139 కిలోమీటర్లు.
(4) 640 కిలోమీటర్లు.



ఎలిగేడు మండలం శివపల్లి వద్ద దెబ్బతిన్న డి-86 కాలువ (పాతచిత్రం)

(5) జిల్లాలోని రెండు డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పాతికేళ్ల కిందట చేసిన లైనింగ్ పనులు దెబ్బతినడంతో ఏనాడూ పూర్తి స్థాయిలో ప్రవాహం ఉండటం లేదు. 2022 వరకు కాలువల మరమ్మతులు ఉపాధిహామీలో నిర్వహించడం, అనంతరం గ్రామ స్థాయిలోనే చేపడుతుండటంతో పర్యవేక్షణ కరవైంది.
(6) ఓదెల, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం, మంథని మండలాలు,
(7) జూలపల్లి మండలం కుమ్మరికుంట, పాలకుర్తి మండలం కన్నాల, కుక్కలగూడూరు వద్ద అండర్ టన్నెల్(యూటీ) కాలువల నిర్మాణానికి రూ.1.8 కోట్లతో ప్రతిపాదించారు. డి-86 పరిధిలో కాలువల మరమ్మతులకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు.
(8) ప్రస్తుతం సమస్య ఉన్న గ్రామాల్లోనే పంచాయతీల ఆధ్వర్యంలో ఉపాధిహామీలో పనులు చేస్తున్నారు. కేవలం పూడికతీత, చెట్ల తొలగింపు వరకే పరిమితమవుతుండటంతో కొద్ది రోజులకే సమస్య మొదటికొస్తోంది.

కొండగట్టులో అన్నదాన సత్రం నుంచి సరకులు మాయం

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయ అన్నదాన సత్రం నుంచి నిత్యావసర సరకులు మాయమైనట్లు తేలడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈనెల 9న అన్నదాన సత్రం నుంచి బియ్యం బస్తాలతో పాటు వివిధ రకాల నిత్యావసర సరకులను ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్నట్లు సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో అధికారులు శనివారం గుర్తించారు. గతంలో కూడా సరకులు మాయమైనట్లు ఆరోపణలున్నాయి. రెండు నెలల కిందట వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి బదిలీపై వచ్చిన రాములు(జూనియర్ అసిస్టెంట్) అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అన్నదాన సత్రం నుంచి బియ్యంతోపాటు ఇతర సరకులు మాయమైనట్లు బయటకు పొక్కడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ విషయమై ఈవో రామకృష్ణారావును వివరణ కోరగా రాములు అనే ఉద్యోగి అన్నదాన సత్రం నుంచి ఓ ఆటోలో అక్రమంగా సరకులు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయమై విచారణ చేపట్టామని సరకులను తరలించిన ఆటోను కూడా రప్పించి పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని పేర్కొన్నారు. ఈ విషయమై ఏఈవో అంజయ్యను సంప్రదించగా అన్నదాన సత్రం ఇన్‌ఛార్జి రాములు ఈనెల 9న గ్యాస్ సిలిండర్లు తీసుకొచ్చే ఆటోలో బియ్యం బస్తాలను, తన ద్విచక్రవాహనంలో నిత్యావసర సరకులను తీసుకెళ్లినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాలను పరిశీలించి విచారణ చేపట్టామన్నారు. ఆదివారం సాయంత్రం రాములుకు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. అన్నదాన సత్రం నుంచి ఆటోలో అక్రమంగా సరకులు తరలిస్తున్నా తనిఖీ చేయకపోవడంపై కొండపైన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పనితీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పండుగ వేళ తీరని విషాదం

వేర్వేరు ప్రమాదాల్లో అయిదుగురి దుర్మరణం

మరో రెండు నిమిషాల్లో బంధువుల ఇంటికి చేరాల్సిన యువకుడి ప్రాణాలు గాలిలో కలిశాయి.. స్నేహితులతో కలిసి కొత్త బట్టలు కుట్టించుకుందామని వెళ్లిన ఆటో డ్రైవర్ వ్యవసాయ బావిలో విగతజీవిగా కనిపించారు.. దుర్గామాత నిమజ్జనోత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తూ మరో యువకుడు విద్యుదాఘాతానికి బలయ్యారు.. అత్తగారింటికి పయనమైన ఇంకో యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.. చిన్నతనంలో కన్నవారికి దూరమై 12 ఏళ్ల అనంతరం తిరిగొచ్చిన యువకుడు పొరుగు జిల్లాలో మృత్యువాత పడ్డారు.. శని, ఆదివారాల్లో జరిగిన పలు ప్రమాదాలు పండుగ వేళ ఉమ్మడి జిల్లాలో తీరని విషాదం నింపాయి..

–న్యూస్‌టుడే బృందం

పెద్దమ్మ ఇంటికి వెళ్తూ..



వినయ్

శంకరపట్నం: తాడికల్‌లో జరిగిన ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందారు. కేశవపట్నం ఎస్సై రవి కథనం ప్రకారం చిగురుమామిడి మండలం లంబాడిపల్లికి చెందిన బండారిపల్లి వినయ్(25) కరీంనగర్‌లో ఉంటున్నారు. శనివారం సాయంత్రం తాడికల్‌లోని పెద్దమ్మ ఇంటికి రావడానికి కరీంనగర్ నుంచి బయల్దేరారు. తాడికల్ గ్రామ శివారులోకి చేరుకోగానే మలుపు వద్ద ద్విచక్రవాహనం అతి వేగంతో అదుపు తప్పింది. రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన వినయ్ అక్కడికక్కడే మృతి చెందారు. కొన్ని క్షణాల్లో పెద్దమ్మ ఇంటికి చేరుకోవాల్సిన వినయ్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో విగతజీవిగా..



త్రినాథ్

మానకొండూర్ : యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మానకొండూర్ మండలం వెల్దిలో విషాదం నింపింది. సీఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఇల్లందుల త్రినాథ్(19) ఆటో నడుపుతున్నారు. శనివారం మధ్యాహ్నం స్నేహితులు కొమ్మగల్ల కిరణ్, రుద్రారం స్వస్తిక్, రామగిరి సందీప్‌తో కలిసి ప్యాంటు కుట్టించుకోవడానికి ఆటోలో రంగపేటకు వెళ్లారు. సాయంత్రం 4 గంటలైనా ఇంటికి రాకపోవడంతో త్రినాథ్‌కు తండ్రి నాంపెల్లి ఫోన్ చేయగా బయల్దేరామని సమాధానమిచ్చారు. సాయంత్రం 7 గంటల సమయంలో 'త్రినాథ్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పడ్డాడ'ని కిరణ్ ఫోన్ చేసి చెప్పారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకోగా, పోలీసుల ఆధ్వర్యంలో బావిలో గాలించినా ఫలితం లేకపోయింది. ఆదివారం ఉదయం త్రినాథ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కిరణ్, స్వస్తిక్, సందీప్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

అత్తగారింటికి వెళ్తూ..



రాజు

సుల్తానాబాద్: భూపతిపూర్ శివారులోని రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచెరామికి చెందిన సింగారపు రాజు(29) దుర్మరణం చెందారు. ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం రాజు ద్విచక్రవాహనంపై దుబ్బపల్లి వైపు నుంచి భూపతిపూర్‌లోకి అత్తగారింటికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. కింద పడిన రాజుపై నుంచి మరో వాహనం వెళ్లడంతో దుర్మరణం చెందారు. మృతదేహం నుజ్జయింది. మృతుడికి భార్య, రెండేళ్లు, నాలుగు నెలల వయసున్న కూతుళ్లున్నారు.

ఉత్సవాలకు సిద్ధం చేస్తూ..



వెంకటేశం

బీమారం: బీమారం మండలం రాగోజిపేటలో దుర్గామాత ఊరేగింపు అనంతరం మహిషాసుర దహనం కోసం అరిసెల వెంకటేశం(36) తీగ చుడుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో కింద పడిపోయారు. వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

తప్పిపోయి తిరిగొచ్చిన నాలుగేళ్లకే..



రవీందర్‌రెడ్డి

ఓదెల, లింగాలఘనపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం వడ్డిచర్ల చిన్న మోరీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వడ్డిచర్ల, మృతుడి గ్రామస్థులు, ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన నోముల రవీందర్‌రెడ్డి(32) నల్గొండలో ఎగ్గిబిషన్ నిర్వహిస్తున్నారు. రెండేళ్ల కిందట తండ్రి రాంచంద్రారెడ్డి మృతి చెందగా తిథి కోసం కారులో స్వగ్రామానికి వస్తుండగా జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిలో లింగాలఘనపురం మండలంలోని వడ్డిచర్లలో కారు అదుపుతప్పి డివైడర్‌ను, కల్వర్టు గోడను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108లో జనగామ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. రవీందర్‌రెడ్డి జమ్మికుంటలో చదువుతున్న సమయంలో తప్పిపోయి 12 సంవత్సరాలు తల్లిదండ్రులకు దూరమై నాలుగేళ్ల క్రితమే స్వగ్రామం వచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రియుడి హత్యతో మనస్తాపం
మహిళ బలవన్మరణం

గుంటూరు, యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: ప్రియుడు హత్యతో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నల్లచెరువుకు చెందిన కాకినాడ అంజలి(29)కి.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికు చెందిన శివరామకృష్ణలకు కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. యైంటిక్లయిన్‌కాలనీ హనుమాన్‌నగర్‌కు చెందిన వడ్డాది వినయ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. మూడు నెలలుగా భర్త, పిల్లల్ని వదిలిన అంజలి ప్రియుడితో సహ జీవనం చేస్తోంది. ఈ నెల 10న అంజలి భర్త శివరామకృష్ణ, సోదరుడు కుమార్‌లు కలిసి వినయ్‌కుమార్‌ను హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి గోదావరిఖని పోలీసులు శివరామకృష్ణ, కుమార్‌లను శనివారం అరెస్టు చేశారు. అప్పటి నుంచి అంజలి గుంటూరు నల్లచెరువులోని తన కుటుంబసభ్యులు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు. ఓవైపు ప్రియుడు హత్యకు గురికావటం.. కుటుంబ సభ్యులు నుంచి అదరణ లేకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన అంజలి.. శనివారం గుంటూరు వర్కర్స్‌కాలనీలోని తన పిన్ని కనకలక్ష్మి ఇంటికి వచ్చింది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కళ్లెదుటే రైలు కింద పడి భర్త...

ఓదెల : వేధింపులపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమె కళ్లెదుటే భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఓదెల మండలం పొత్కపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీలకుంట గ్రామానికి చెందిన రెడ్డి ఆదిత్య(32) పొత్కపల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లిలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసై తరచూ భార్య కవితను వేధింపులకు గురి చేసేవారు. ఆదివారం సాయంత్రం కూడా ఆదిత్య భార్యతో గొడవపడ్డారు. దీంతో కవిత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నీపై ఫిర్యాదు చేసి వచ్చినట్లు భర్తతో తెలిపింది. నాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ ఇంటి పక్కనే ఉన్నా రైల్వేట్రాక్ పైకి పరుగెత్తుకుంటూ వెళ్లి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి భార్య చూస్తుండగానే ఆత్మహత్య చేసుకున్నారు. ఆదిత్యకు కుమారుడు, కూతురు ఉన్నారు.

ఆ బస్సులకు మహిళలే యజమానులు

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం, రవాణా విభాగం

- 61 మండల సమాఖ్యలతో కొనుగోలు
- ఆర్టీసీకి అద్దె.. అతివలకు ఉపాధి
- పైలట్ ప్రాజెక్టుగా కరీంనగర్ జిల్లా


మహిళా ప్రగతి రథ చక్రాలు రోడ్డెక్కేందుకు కార్యాచరణ మొదలైంది. మండల మహిళా సమాఖ్యలతో బస్సులు కొనుగోలు చేయించి.. ఆర్టీసీకి అద్దెకు ఇప్పించి.. వారికి ఉపాధి అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ, టీజీఎస్-ఆర్టీసీ రవాణా శాఖల సంయుక్త నిర్వహణలో ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే బస్సులను మహిళా సంఘాల ద్వారా తీసుకోవాలన్న నిర్ణయంలో భాగంగా మొదట మూడు జిల్లాలను పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయగా అందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా కూడా ఒకటిగా ఉంది. మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలను కూడా చేర్చారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలు ఇలా...

జిల్లా	మండలాలు	కొనుగోలు బస్సులు
కరీంనగర్	15	15
జగిత్యాల	20	20
పెద్దపల్లి	14	14
సిరిసిల్ల	12	12

ప్రాథమికంగా నిర్ణయం..

ఈ బాధ్యతను మెప్మాతోపాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలు చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 మండల మహిళా సమాఖ్యలు ఉన్నాయి. వాటి ఖాతాల్లో ఉన్న కొంత డబ్బుతోపాటు బ్యాంకు రుణ సదుపాయం, ప్రభుత్వ రాయితీ వంటి వాటిని జోడించి బస్సులు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. అద్దె బస్సుల్లోనూ అవసరమైన వారికి ఉపాధి కల్పించే అవకాశముంది. ఇందుకు అవసరమైతే వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో మహిళా శక్తిని చాటే అవకాశముంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 100 నుంచి 150 సంఘాలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వాటి ద్వారా బస్సులు కొనాలనేది ప్రభుత్వ ఉద్దేశం.

తీరనున్న బస్సుల కొరత..

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 860 బస్సులు ఉండగా, ఇందులో 333 అద్దెవి ఉన్నాయి. ఇవి కాకుండా ఇటీవల 33 ఎలక్ట్రిక్ బస్సులు కూడా అందుబాటులోకి వచ్చాయి. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత ప్రయాణికుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అంతకుముందు రీజియన్ వ్యాప్తంగా 2 లక్షల మంది ప్రయాణించగా పథకం అమల్లోకి వచ్చాక ఈ సంఖ్య అయిదు లక్షలకు చేరింది. ఉన్న వాటితోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కొన్ని సందర్భాల్లో పరిమితికి మించిన ప్రయాణికులతో వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మండల మహిళా సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేయించి, ఆర్టీసీకి అద్దెకు ఇవ్వాలని నిర్ణయించింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 61 బస్సులు అందుబాటులోకి రానున్నాయి. బస్సుకు ఇద్దరు చొప్పున చోదకులను తీసుకున్నా మరో 122 మందికి ఉపాధి లభించనుంది.

విధి విధానాలు రూపొందిస్తున్నాం

మండల సమాఖ్యల ద్వారా బస్సుల కొనుగోలుకు సంబంధించిన విధి విధానాలు రూపొందిస్తున్నాం. మొదట కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ అమలు చేసిన తర్వాత అన్ని జిల్లాలకు విస్తరింపజేస్తాం. మహిళా శక్తి ద్వారా ఉపాధి కల్పించనున్నాం. త్వరలోనే తుది రూపకల్పన ప్రకటిస్తాం.

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)
జగిత్యాల 94400 23123
కోరుట్ల 9491324656 | ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే - జగిత్యాల ధరూర్‌క్యాంపు

? ఇటీవలి గాలివానలకు వరిపైరు పడిపోయి నష్టం వాటిల్లింది, పరిహారానికి చర్యలు తీసుకోరా.? - స్వామి, అర్వపల్లి

✓ జిల్లాలో వరి నష్టాన్ని ప్రాథమికంగా అంచనావేసి పంపించాము, ప్రభుత్వ అనుమతితో తుదిసర్వే చేపడతాము.
- సీహెచ్.రాంచందర్, జిల్లా వ్యవసాయాధికారి

నృత్య కళాకారిణికి సన్మానం

కొడిమ్యాల: దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రానికి చెందిన కొట్టాల హంసినిరెడ్డిని వందేమాతరం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హంసినిరెడ్డి హిందూ సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకోవడమే కాకుండా ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడానికి కృషి చేస్తుందని తెలిపారు. బైరి రవీందర్‌రెడ్డి, బైరి వెంకటి, ఉపాధ్యాయులు ఆదిరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



హంసినిరెడ్డిని సన్మానిస్తున్న యూత్ సభ్యులు

విద్యార్థులకు..

రాయికల్: రాయికల్ మండలం ఆలూరు గ్రామానికి చెందిన లక్ష్యం రిషిత, మనీరాజ్ అన్నాచెల్లెలు ఇటీవల మనాలీలో పర్వతారోహణ చేసి ప్రశంసాపత్రాలు పొందారు. ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విద్యార్థులను సత్కరించారు. చెర్లకొండాపూర్ గ్రామస్థులు గ్రామానికి బోరు, మోటారు మంజూరు చేయాలని కోరగా వెంటనే స్పందించి మంజూరు చేశారు.

క్రీడాకారులకు..

వెల్గటూరు: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎండపల్లి మండలం గుల్లకోటలో ముదుగంటి అనంతరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికలపై రాణించిన క్రీడాకారులను సన్మానించారు. తహసీల్దారు నవీన్, వెంకటరమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువలకు నీటి విడుదల నిలిపివేత

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ జలాశయంలోకి ఆదివారం సాయంత్రం వరకు ఇన్‌ఫ్లో 3,590 క్యూసెక్కులకు తగ్గగా వరద కాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ, లక్ష్మీ కాలువలకు నీటిని నిలిపివేశారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది. ఈ వానాకాలంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 246.025 టీఎంసీల వరద వచ్చిచేరగా 172.924 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు.

నేడు పాలకమండలి ప్రమాణ స్వీకారం

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారం సోమవారం జరగనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దినేష్, ఉపాధ్యక్షులు రాజేష్‌లు తెలిపారు. మార్కెట్ యార్డులో ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హాజరవుతారన్నారు.

రామాజీపేట గ్రామస్థుల ధర్నా

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: దసరా వేడుకల్లో తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన పలువురు ఆదివారం పట్టణంలోని పోలీస్ ఠాణా ఎదుట రాయికల్-జగిత్యాల ప్రధాన రహదారిపై బైఠాయించారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు అకారణంగా ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతోపాటు ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారని నిరసన వ్యక్తం చేస్తూ నాలుగు గంటల పాటు రాస్తారోకో నిర్వహించి వాహనాల రాకపోకలను అడ్డుకొన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ కృష్ణారెడ్డి ఆందోళన చేస్తున్న గ్రామస్థులతో మాట్లాడగా విచారణ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామనే హామీ మేరకు ధర్నా విరమించారు. దాడి చేసిన వారిపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.



కోరుట్లలో అశ్వవాహనంపై దర్శనం



వెల్లుల్లలో మహిషాసుర సంహారం తిలకిస్తున్న గ్రామస్థులు



కోరుట్లలో శ్రీవేంకటేశ్వరస్వామి ఊరేగింపు



కొడిమ్యాలలో..

ఘనంగా విజయ దశమి వేడుకలు

జిల్లాలో విజయ దశమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శమీ పూజలు నిర్వహించారు. అనంతరం మహిషాసుర సంహారం కార్యక్రమం చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే యంత్రాంగం



మల్లాపూర్‌లో..



మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డా.సంజయ్



కొడిమ్యాలలో శమీ పూజ



మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ



రాయికల్‌లో దసరా వేడుకలలో పట్టణ ప్రజలు



వెల్గటూరు: స్తంభంపల్లిలో మహిషాసుర సంహారం



జగిత్యాల గ్రామీణం: పొరండ్లలో శమీపూజ



సారంగాపూర్: దుబ్బరాజన్న ఆలయంలో..



జగిత్యాల రెడ్డి సంఘంలో జీవన్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలం అల్లీపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు తదితరులున్నారు.

రాయికల్ పట్టణం: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 2010-11 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించడంతోపాటు రోజంతా ఉల్లాసంగా గడిపారు.

జగిత్యాలధరూర్‌క్యాంపు: జగిత్యాల పట్టణంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ పాఠశాలకు చెందిన 1993-94 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

మెట్‌పల్లి పట్టణం: పట్టణంలోని ఆరపేట ప్రాథమిక పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించి, గురువులను సత్కరించారు. పూర్వ ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం, ఉపాధ్యాయులు రాజగంగారాం, రాజన్న, నాగరాజు, నాగన్న, సురేష్, అరుణ, రాధ పాల్గొన్నారు.



రాయికల్: 2003-04 పూర్వ విద్యార్థులు



మెట్‌పల్లిలో..



జగిత్యాలలో 1993-94 బ్యాచ్ విద్యార్థులు



రాయికల్‌లో 2010-11 బ్యాచ్ విద్యార్థులు

బతుకమ్మ సంబరాలు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే తల్లి సరోజనతో పాటు పుర ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత బతుకమ్మలను నెత్తిన ఎత్తుకుని వచ్చారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవిమాత ఆలయంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. పట్టణంలోని పెద్ద చెరువుతో పాటు వట్టి వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. చంద్రశేఖర్ రావు, పుర ఉద్యోగులు నాగేశ్వర్‌రావు, ఏఈ తిరుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో ఎమ్మెల్యే తల్లి సరోజన, పుర ఛైర్‌పర్సన్ సుజాత



బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న ఆర్యవైశ్యులు

మెట్‌పల్లి: బహ్రెయిన్‌లో పద్మశాలి సమాజ్ ఆధ్వర్యంలో దసరా, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత పూజ జరిపారు. అనంతరం కన్నడ సంఘం హాల్‌లో బతుకమ్మ, దాండియా, పలు సాంస్కృతిక కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. బహ్రెయిన్ పద్మశాలి సమాజ్ గౌరవాధ్యక్షుడు అల్లె గంగాధర్, అధ్యక్షుడు వేముల కృష్ణ, ఉపాధ్యక్షుడు గంగుల సుదర్శన్, సుధాకర్, శ్రీనివాస్, శ్రీధర్, శంకర్, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా పుణ్యతిథి వేడుకలు

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లి సాయిబాబా ఆలయంలో పుణ్యతిథి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఉదయం పల్లకీసేవతో వేడుకలను ఆలయ వ్యవస్థాపకుడు తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రారంభించి సాయిబాబాకి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, హోమాన్ని జరిపారు. ఎమ్మెల్యే సంజయ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం పుర ఛైర్‌పర్సన్ సుజాత అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాగభూషణ్, ఇల్లెందుల శ్రీనివాస్, నర్సింగరావు, పవన్, గణేష్, మైలారపు లింబాద్రి, మహజన్ నర్సింలు, మాడిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో అన్నపూజలో ఎమ్మెల్యే, పుర ఛైర్‌పర్సన్

వెండి కిరీటం బహూకరణ

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ సాయిబాబా ఆలయంలో ఆదివారం పుణ్యతిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న హారతి ఇచ్చి పల్లకీసేవ జరిపారు. మెట్‌పల్లికి చెందిన గోవర్ధన్ దంపతులు వెండి కిరీటాన్ని బహూకరించారు.

కోరుట్ల: కోరుట్ల పట్టణ శివారులోని శ్రీసాయిరామ దేవాలయంలో సాయిబాబా పుణ్యతిథి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ స్వామివారికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభిచారు.

పంచశీల పతాకావిష్కరణ

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: సామ్రాట్ అశోక్ చక్రవర్తి విజయదశమి వేడుకలను మెట్‌పల్లిలో నవయాన్ బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో నాయకులు బైక్‌ర్యాలీ తీసి చావిడి వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పంచశీల పతాకాన్ని ఆవిష్కరించారు. దయ్యరాజారాం, నీరటి నరేందర్, పాలెపు గంగ నర్సయ్య, దయ్య రఘువీర్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువ భూమికోసం ఇరువర్గాల వివాదం

కోరుట్ల: కథలాపూర్ మండలం దుంపేట గ్రామశివారులోని వరదకాలువ భూమి కోసం ఆదివారం ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఇరువర్గాల వారు పెద్దఎత్తున చేరుకోవడంతో గొడవ జరిగే అవకాశం ఉండటంతో సీఐ సురేశ్‌బాబు, కథలాపూర్, కోరుట్ల ఎస్సైలు నవీన్‌కుమార్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఇరువర్గాల వారితో సీఐ, ఎస్సైలు మాట్లాడి వారిని అక్కడి నుంచి పంపించడంతో గొడవ సద్దు మనిగింది.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో రామాలయంతో పాటు తాతమ్మ ఆలయాల నిర్మాణానికి శనివారం గ్రామస్థులు భూమి పూజ చేశారు. దసరా సందర్భంగా ఆలయానికి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వీడీసీ సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, రాజు, హరీష్, శంకర్, లక్ష్మి రాజం, తదితరులు పాల్గొన్నారు.

ఇడ్లీలో జెర్రి.. హోటల్ సీజ్

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని ఓ హోటల్‌లో ఇడ్లీలో జెర్రి రావడంతో పురపాలక అధికారులు హోటల్‌ను సీజ్ చేశారు. ఓ మహిళ హోటల్‌లో ఇడ్లీ కొనుగోలు చేసి ఇంటికి వెళ్లి తింటుండగా జెర్రి కనిపించింది. దీంతో ఆమె హోటల్‌కు వచ్చి ఆందోళనకు దిగింది. బల్దియా అధికారుల దృష్టికి తేవడంతో అధికారులు హోటల్‌కు వచ్చి ఇడ్లీలను స్వాధీన పర్చుకొని హోటల్‌ను మూసివేశారు.

విజేతలకు సత్కారం

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: క్రమశిక్షణ గల విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలుస్తారని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. డీఎస్సీలో జిల్లా స్థాయి ర్యాంకులు సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులైన సుమారు 18 మందిని కొమిరెడ్డి కరంలు మార్కెట్ యార్డులో సన్మానించి అభినందించారు. జెట్టి లింగం, మర్రి సహదేవ్, మార్గం గంగాధర్. లింగారెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, యామ రాజయ్య, షేక్ మహ్మద్, పిప్పరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేర వార్తలు

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

రామాయంపేట, మల్లాపూర్, న్యూస్‌టుడే: మద్యం తాగడం మానివేయాలని కుటుంబ సభ్యులు సూచించడంతో.. ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయిరెడ్డి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేటకు చెందిన మారగాని రాజు(32) జీవనోపాధి కోసం గుండ్ల పోచంపల్లిలో ఆరు నెలలుగా కుటుంబంతో సహా నివాసం ఉంటున్నాడు. ఆటో నడపడంతో పాటు కూలీ పనులు చేస్తున్నాడు. తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఇంట్లో గొడవలు జరిగేవి. ఈ విషయమై మరోమారు గొడవ జరగడంతో ఆటోలో రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటకు వచ్చి.. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు.



రాజు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని మెట్‌పల్లిరోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నక్కలగుట్ట ప్రాంతానికి చెందిన సంతోష్(29) శనివారం రాత్రి మెట్‌పల్లిరోడ్డు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వెంటనే అతడిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి బాలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం గుర్తింపు

మెట్‌పల్లి: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన సుంకెట కొండస్వామి(46) మృతదేహం మేడిపల్లి మండలం కట్లకుంట సమీపంలో ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం గుర్తించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 10న కొండస్వామి పని నిమిత్తం మెట్‌పల్లికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యమైంది. మెట్‌పల్లి నుంచి స్వగ్రామానికి తిరిగొస్తూ మార్గమధ్యలో వెల్లుల్ల శివారులో ఎస్సారెస్పీ కాలువ వద్ద బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

రాయికల్: రామాజీపేట గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా శనివారం శమీపూజ కాకుండా జమ్మి ఆకు తెంపవద్దని కాపాలా కాస్తున్న వేములవాడ నరేష్ పలువురు యువకులను వారించాడు. దీంతో గ్రామానికి చెందిన వేల్పుల నవీన్, బద్దెనపల్లి సంజీవ్, పాలెపు గణేష్, జంగం ఉదయ్, బెక్కెం సుమంత్, పడిగల సన్నీ, కండ్లపల్లి వివేక్, అచ్చ వర్షిత్ నరేష్‌ను తీవ్రంగా దూషించి, కర్రలతో దాడి చేయగా తీవ్ర గాయలయ్యాయని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

జగిత్యాల గ్రామీణం: మండలంలోని పొరండ్లలో మర్రిపెల్లి సాయినాథ్‌కు చెందిన పార్కింగ్ చేసిన కారును గోడ పంచాయితీ విషయంలో శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన ఆరె తిరుపతి, మాదాసు మధు, చిర్రవేణి రంజిత్, గొల్లపల్లి మనోజ్ కర్రలతో ధ్వంసం చేయటంతో బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుపతి, మధు, రంజిత్, మనోజ్‌పై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

ఇరువర్గాలపై..

సారంగాపూర్: రేచపల్లిలో దసరా ఉత్సవాలలో భాగంగా ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన బుర్ర రాజేశం, దీటి కొమురయ్య వర్గాల మధ్య గొడవ జరగడంతో అయిదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

ముగ్గురు యువకులపై దాడి

మల్యాల: మల్యాల మండలం ఓబులాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఏడుగురు యువకులు కలిసి అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై దాడికి పాల్పడ్డట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మెరుగు మనోహర్ అనే యువకుడిపై కత్తితో దాడిచేసి ఒంటిపై మూడు చోట్ల తీవ్రంగా గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడ్డట్లు ఎస్సై తెలిపారు. దసరా సందర్భంగా ఏర్పడ్డ గొడవలే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. ఈ సంఘటనలో మండల మహేష్, అతని కుమారుడు దినేష్‌పై కూడా నిందితులు దాడిచేసి తీవ్రంగా గాయపర్చినట్లు ఎస్సై వివరించారు. బాధితుడు మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు వివరించారు.

● మల్యాలలోని జగ్గని ఒర్రె సమీపంలో శనివారం సాయంత్రం ఇరు వర్గాల యువకుల మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. అయితే ఈ విషయమై తమకు బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్సై వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మెట్‌పల్లి: దసరా సెలవుల్లో ఊరికి వెళ్లి వచ్చేలోగా ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మెట్‌పల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన కట్కూరి రాజు పది రోజుల కిందట ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఆదివారం ఇంటికి చేరుకున్న ఆయన చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్సై చిరంజీవి చేరుకొని విచారణ జరిపారు. అక్కడున్న సీసీ కెమెరాలో ఓ వ్యక్తి గొడుగు పట్టుకొని వెళ్లిన దృశ్యాలు నమోదు కాగా క్లూస్‌టీం చేరుకొని పరిశీలించారు. సుమారు అయిదు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్నిప్రమాదం

రాయికల్ పట్టణం, న్యూస్‌టుడే: రాయికల్ పట్టణంలో ప్రమాదవశాత్తు ఓ ఇంట్లో మంటలు చెలరేగగా సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పోచమ్మవాడలో దొడ్డ వసంతరెడ్డి ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగగా భవానీ మండపంలో పూజలు చేస్తున్న దీక్షాదారులు, యూతు సభ్యులు గమనించి సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేశారు. విలువైన ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి.

మృతికి సంతాపం

రాయికల్: రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామ మాజీ సర్పంచి చెన్నమనేని ఆనందరావు(70) ఆదివారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. 1970-1985 వరకు 15 ఏళ్ల ఆయన బోర్నపల్లితో పాటు అప్పటి అనుబంధ గ్రామం జగన్నాథపూర్ సర్పంచిగా సేవలు అందించారు. ఆయన మృతికి మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

సరస్వతీదేవి ఆలయ నిర్వాహకుడి మృతి

మల్యాల: మల్యాల మండలం నూకపల్లి శివారులోని సరస్వతిదేవి ఆలయ నిర్వాహకుడు అంగలి రాజం(72) శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతిపట్ల ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్.రావుతో పాటు నూకపల్లి గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు. జగిత్యాలలో అంత్యక్రియలు నిర్వహించారు.



రాయికల్ పట్టణంలో శోభాయాత్ర



గొల్లపల్లిలో..



మల్యాల తాటిపల్లిలో బాలికల నృత్యం



మెట్‌పల్లిలో చెన్నకేశవస్వామి

దుర్గామాత విగ్రహాల నిమజ్జనం

దేవీశరన్నవరాత్రుల సందర్భంగా 9 రోజుల పాటు వైభవంగా పూజలు నిర్వహించిన దుర్గామాత విగ్రహాల నిమజ్జనం కనుల పండువగా జరిపారు. కోలాటాలు, నృత్యాలు, పోతరాజుల వేషధారణల విన్యాసాలు అలరించాయి. - న్యూస్‌టుడే యంత్రాంగం



కొడిమ్యాల: శోభాయాత్రలో యువతుల నృత్యం



ఇబ్రహీంపట్నంలో..



కోరుట్లలో దుర్గాదేవి ఊరేగింపు



వెల్గటూరులో అమ్మవారి శోభాయాత్ర